కథా నిలయం
శ్రీకాకుళం



# లయం

రైల్వే స్టేషన్ ముందున్న పార్కింగ్ లాట్‌లో చిట్టిబాబు కారు ఆపాడు. హ్యాండ్‌బ్యాగ్ భద్రంగా పట్టుకుని వెనక తలుపు తెరుచుకుని దిగాను. అవతలి పక్క నుండి ప్రభాకర్ కారు దిగాడు. నా పక్కకు వచ్చి "సామాన్లు చిట్టిబాబు తీసుకువస్తాడు" అన్నాడు.

స్టేషన్ లోపలికి నడిచాం. రెండు పెట్టెలు తప్ప ఎక్కువ సామాన్లు లేవు. నాకు సంబంధించినవి, అవసరమని పించినవి కొంచెం కొంచెంగా లోగడ

హైదరాబాద్ వెళ్ళినప్పుడే తీసుకు వెళ్ళాను.

మౌనంగా పక్కపక్కనే నడుస్తూ ప్లాట్‌ఫాం చివరికంటా వచ్చి సిమెంటు బల్లమీద కూర్చున్నాం. ఎండ పలచగా ఉంది. సీజను కాకపోవడం వలన జనం అట్టే లేరు. చుట్టూ తిరిగి తెనాలి, విజయవాడ మీదుగా వెళ్ళినా నాకీ బండే అనుకూలంగా ఉంటుంది.

మా వెనకనే చిట్టిబాబు పెట్టెలు తీసుకువచ్చి సిమెంటు బల్ల పక్కనే పెట్టి వెళ్ళిపోయాడు. చిట్టిబాబు ప్రభాకర్‌కు కుడిభుజం. చిట్టిబాబుకు ముప్పయి సంవత్సరాలుంటాయి. ప్రభాకర్‌చేత ఆఫీసుపని ఏది చేయించుకోవాలన్నా చిట్టిబాబును పట్టుకుంటే చాలు అనే మాట చెల్లుబడిలో ఉంది. అంతెందుకు ప్రభాకర్ సెల్ చిట్టిబాబు దగ్గరే ఉంటుంది.

సాయంత్రం అయిదూ అయిదయింది. అయిదూ ఇరవైకి బండి ఉంది. తెలవారుతుండగా సికింద్రాబాద్ చేరుకుంటాను. కాంతారావు స్టేషన్‌కు వస్తానన్నాడు.

చిట్టిబాబు తిరిగి వచ్చి పేపరు కప్పుల్లో మా ఇద్దరకూ కాఫీ తీసుకువచ్చి ఇచ్చాడు. నేను కాఫీ కన్నా టీనే ఎక్కువ ఇష్టపడతాను. ముసుపు కాఫీయే ఎక్కువ తాగేదాన్ని. హైదరాబాద్‌లో నా అలవాట్లు దాదాపు అన్నీ మారిపోయాయి. నేనూ మారిపోయాను. అయిదేళ్ళ కిందటి నేను ఇప్పుడు నేను కాదు. కాఫీ వేడిగా ఉంది. ఏదో ఆలోచిస్తూ ప్రభాకర్ కాఫీ తాగుతున్నాడు. ఏం ఆలోచిస్తుంటాడో నేను ఊహించగలను.

ఏడేళ్ళ కిందట ఇంటర్ కాగానే ఆ ఊరికి పెళ్ళికూతురిగా వచ్చాను. ప్రభాకర్ నాకు దగ్గర బంధువే. అతన్ని మనస్ఫూర్తిగా ఇష్టపడి సంతోషంగానే వచ్చాను. తీరా పెళ్ళి అయి రోజులు గడిచాక, అంత త్వరగా ఎందుకు పెళ్ళి చేసుకున్నానా అనుకున్న రోజులు ఉన్నాయి. ప్రభాకర్ మంచి వ్యక్తి. నా మనసెరిగి మసులుకునేవాడే. నా ఎడల అతను గట్టిగా ఉండుంటే నా జీవితం మలుపు తిరిగి ఉండేది కాదు. అది నా అదృష్టమో, దురదృష్టమో నాకే అర్థం కావడం లేదు. ఒకటి మటుకు నిజం. నేను చేస్తున్న పని మంచిది కాదు. నాకే సిగ్గుగా ఉంది.

సంవత్సరం తిరగకుండా బుజ్జి పుట్టింది. ఆడపిల్ల పుడితే ఇంటికి లక్ష్మి వస్తుందని అందరూ అంటున్నప్పుడు నవ్వేదాన్ని. అప్పట్లో అటువంటి వాటిమీద

నాకేమాత్రం నమ్మకం ఉండేది కాదు. నా విషయంలో ఇంటికి మొదటి సంతానమైనా, నేను పుట్టినప్పుడు మా పుట్టింటి ఆర్థిక పరిస్థితి ఒక మోస్తరుగా ఉండేది. తర్వాత నా పెళ్ళయి మెట్టినింటికి వచ్చాక మావాళ్ళ పరిస్థితి ఎంతో మెరుగయింది. నాన్న వ్యాపారం బాగా పుంజుకుంది. బుజ్జి పుట్టాక మాకన్నీ కలిసి వచ్చాయి. ఇంజనీరింగ్‌లో నేను కోరకున్న బ్రాంచిలో సీటు వచ్చింది. అదీ హైదరాబాద్‌లో.

అది ఒకందుకు మంచిదయింది. ప్రభాకర్ గ్రూప్ వన్‌లో సెలక్టయి రెవెన్యూ విభాగంలో చేరాడు. అదృష్టం కొద్దీ మా ఊరుకు చుట్టుపక్కలే ఉండిపోతున్నాడు. మా బుజ్జికి ఇప్పుడు ఆరేళ్ళు. మాటకారి. నా మీద కన్నా దానికి నాన్న మీద ఎంతో ప్రేమ. నన్ను అసలు పట్టించుకోదు. సెలవులకు ఇంటికి వస్తే, నన్ను ఎవరో పరాయి మనిషిని చూసినట్టు చూస్తుంది. ప్రభాకర్ తల్లి అన్నా బాగా ఇష్టపడుతుంది. అదీ మరింత మంచిదయింది.

హైదరాబాద్ వెళ్ళి నేనెంతగా మారిపోయానో ప్రభాకర్ కూడా నేను ఊహించనంతగా మారిపోయాడు. సమయానికి ఇంటికి రాడు. ఇంటికి తాగి చేరుకుంటాడు. సిగరెట్లు తాగడం అలవాటైంది. చాలాకాలం నుండి మేమిద్దరం ఒక గదిలో పడుకోవడం లేదు.

"తాగొద్దని చెప్పి చెప్పి విసిగిపోయాను. నువ్వయినా గట్టిగా చెప్పమ్మా" అంది మా అత్తయ్య. అతను ఎందుకు అలా అయిపోతున్నాడో నాకు తెలుసు. ఏం చెప్పేది? ఏ ముఖంతో చెప్పేది? చెప్పేంత ధైర్యం, చొరవ నాకు లేవు. పోయాయి. అయినా "చెబుతాను" అన్నాను. నేను చెప్పనని ఆమెకు తెలియదు.

నా ప్రవర్తనలో తేడా కనిపెట్టిందో ఏమో, ఒకసారి "మీ ఇద్దరూ మునుపటిలా అట్టే మాట్లాడుకోవడంలేదు. పోట్లాడుకున్నారా ఏమిటి?" అనేసరికి ఆశ్చర్యంతో వెంటనే జవాబు చెప్పలేకపోయాను. ప్రభాకర్ తల్లికేమైనా చెప్పి ఉంటాడా అనిపించింది. అతను అటువంటివాడు కాదు. బాధను, దుఃఖాన్ని, రహస్యాలను గుండెలో పాతేసుకుంటాడు. కాకపోతే మునుపటంత హాయిగా నవ్వలేకపోతున్నాడు. తేరుకుని మామూలు మనిషి కావడానికి చాలా సమయం పట్టొచ్చు. కాకపోవచ్చు.

"బాగానే మాట్లాడుకుంటున్నాం కదా" అన్నాను పైకి.

సమ్మిందో, లేదో తెలియదు.

కాఫీ తాగి కప్పు మడతలు పెట్టి, లేచి వెళ్ళి కొద్దిదూరంలో ఉన్న చెత్తకుండీలో పడేసి, తిరిగి వచ్చి నాకు దగ్గరగా కూర్చున్నాడు. ఈమధ్య అంత దగ్గరగా ఎప్పుడూ కూర్చోలేదు. సిగరెట్ వెలిగించాడు. లోగడ నాకు సిగరెట్ వాసనంటే అసలు గిట్టేది కాదు. కాంతారావు కూడా సిగరెట్ తాగుతుంటాడు. అతనివలనే అయిష్టం పోయిందనుకుంటాను. అతను నాకన్నా రెండేళ్ళు సీనియరు. క్యాంపస్‌లో సెలక్ట్ అయి, నాకు ఉద్యోగం దొరికాక ట్రైనింగ్ అతని దగ్గరే పడడంతో అతనికి దగ్గరయ్యాను.

కాంతారావుకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. అయిదారుసార్లు నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. అతని భార్య పేరు మహాలక్ష్మి. నాకంటే ఏడెనిమిదేళ్ళు పెద్దది. మంచి మనిషి. మొదటిసారి వాళ్ళింటికి వెళ్ళి తిరిగి వచ్చేసేముందు నా పాదాలకు పసుపు రాసి కొత్త పట్టుచీర పెట్టింది. ఆ ఇల్లు, ఆమె సంస్కారం చూశాక ఆమెకు అన్యాయం చేయడం ఇష్టమనిపించక, అతనితో సంబంధం తెంచుకుందా మనుకున్నాను. వీలు కాలేదు. ఆ విషయం ప్రభాకర్‌కు చెప్పడానికి చాలా భయపడ్డాను. నిద్ర లేకుండా చాలా రాత్రులు గడిపాను. ఇక్కడ నా ఒక్క కుటుంబమే కాదు. కాంతారావు కుటుంబం కూడా విచ్ఛిన్నం కాబోతుంది అనుకున్నాను. అక్కడ పొరబడ్డాను. నాలా కాకుండా కాంతారావు తన కుటుంబాన్ని వదులుకోనన్నాడు.

"మరెలా?" అని అడిగితే,

"నువ్వూ ఉంటావు. తనూ ఉంటుంది" అన్నాడు.

ఈ మాట అతనినుండి వస్తుందని ఊహించలేదు. ఈ విషయంలో నేను తొందరపడి నట్టనిపించింది. నా ఉద్దేశం చెప్పడానికి ప్రయత్నించాను. అతను వినడానికి ఇష్టపడలేదు.

లోన్ తీసుకుని మా ఆఫీసుకు దగ్గరగా ఫ్లాట్ తీసుకున్నాను. గృహప్రవేశానికి ఎక్కువ మందిని పిలవలేదు. మహాలక్ష్మి వచ్చి మంచి డబుల్‌కాట్ ఇచ్చింది. "మీకు" అంది రహస్యం చెపుతున్నట్టు. ప్రభాకర్‌ను పిలుద్దామని చివరిరోజు వరకు అనుకున్నాను. పిలవలేదు. "ఫ్లాట్ తీసుకున్నాను" అని మటుకు అన్నాను. "అలాగా" అన్నాడు.

కాసేపు మౌనంగా ఉండిపోయాం. ఆ మౌనం ఇబ్బందిగా అనిపించి "అప్పుడప్పుడు నేను వస్తూ ఉండొచ్చా?" అడిగాను.

నవ్వి "నిర్భయంగా వస్తూండచ్చు" అన్నాడు.

చాలారోజుల తర్వాత అతని ముఖంలో నవ్వు చూశాను. అతని నవ్వు బావుంటుంది. బుజ్జి నవ్వు అతని నవ్వులా ఉంటుంది. బుగ్గలు సొట్ట పడతాయి. బుజ్జిని నాతో కూడా తీసుకెళ్దామని నాకు ఎప్పుడూ అనిపించలేదు. తండ్రిని, నాయనమ్మని వదిలి బుజ్జి ఉండదు.

చివరికంటా కాలిన సిగరెట్‌తో మరో సిగరెట్ వెలిగించుకుని సిగరెట్ పీకను పట్టాల మీద పడేలా విసిరాడు. గాలి విసురుగా వీస్తోంది. వెళ్తున్నాను. సరే. చివరకు నేనేమవుతాను?

"నువ్వు ఏమనుకోకుంటే..." ఆగి అతని ముఖంలోకి చూస్తూ అతని చేయి నా చేతుల్లోకి తీసుకున్నాను.

చేయి వేడిగా ఉంది.

"చెప్పు" అన్నాడు.

"నువ్వు మందు తాగడం ఎక్కువైంది. మానేయడం లేదు. తగ్గించకుంటే...?" అతని ముఖంలోకి చూస్తూ ఆగాను. తర్వాత ఏమనాలో నాకు తోచలేదు.

సిగరెట్ పొగ గుండెలనిండా పీల్చి, రెండు క్షణాలు ఆగాక వదిలాడు. గడ్డం రెండు రోజులంత మాసి ఉంది. చొక్కా కొత్తదే కాని, పై రెండు గుండీలు లేవు. తనమీద తను మునుపటంత శ్రద్ధ తీసుకోవడం లేదు. పని ఒత్తిడి వల్ల అయి ఉండదు.

"నీ ఇష్టాయిష్టాల గురించి ఏనాడయినా ఒక్క మాటయినా అన్నానా?" నవ్వుతూ అన్నాడు.

బండి ప్లాట్‌ఫాం ముందుకు వస్తోంది. చిట్టిబాబు వచ్చి నా పెట్టెలు అందుకున్నాడు. ఇద్దరం లేచి నుంచున్నాం. ప్రభాకర్ సిగరెట్ కింద పడేసి కాలితో నలిపాడు. అతని చేయి నిమురుతూ, "ఆరోగ్యం జాగ్రత్త" అన్నాను.

ముందు చిట్టిబాబు ఎక్కి, నా పెట్టెలు బెర్త్ కింద పెట్టి దిగిపోయాక నేను ఎక్కబోతోంటే చిట్టిబాబు నాకో ఎర్రటి ఫైలు ఇచ్చి, "అయ్యగారు మీకిమ్మన్నారు" అన్నాడు. ప్రభాకర్ వంక చూసి, "ఏమిటిది?" అని అడిగాను.

"కూర్చుని సావకాశంగా చూడు."

బండి కదిలింది.

"బై" అన్నాడు.

"బై" అని చేయి ఊపి అతను కనుమరుగు అయ్యాక వచ్చి లోపల కూర్చుని నా హ్యాండ్‌బాగ్ వడిలో పెట్టుకున్నాను.

కుతూహలం ఆపుకోలేక ఎర్రఫైలు తెరిచాను. స్టాంపు కాయితాల మీద అతను విడాకులు అంగీకరిస్తున్న పత్రం. రిజిస్టర్ అయిన వీలునామా పత్రాలు. రెండు బ్లాంకు చెక్కులు, తన ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లు. బుజ్జికి నన్ను గార్డియన్‌గా పెట్టాడు. అతను ఉత్తిగా మిగిలిపోయాడు. నా హృదయం దుఃఖంతో భారం కాసాగింది. అతని మంచితనాన్ని చేతకానితనంగా తీసుకున్నాను. కళ్ళలో నీళ్ళు నిలవడం లేదు. బండి ఆగితే బావుండు. ఏదయితే అయిందని లేచి నుంచుని గొలుసు లాగుదామనుకునేంతలో ఎవరో గొలుసు లాగినట్టున్నారు. బండి ఆగింది. వెంటనే నా సెల్ మోగింది. ప్రభాకర్ నంబరు నుండి కాల్ వచ్చింది.

"అసలెందుకు అన్నీ నా పేరున రాయడం..." ఏడుస్తూనే అంటున్నాను.

ప్రభాకర్ కాదు! "అమ్మా, నేనమ్మా చిట్టిబాబును."

నన్ను నేను అదుపు చేసుకుంటూ, "చెప్పయ్యా" అన్నాను.

"అయ్యగారు మనకిక లేరమ్మా" ఏడుస్తూ చెబుతున్నాడు.

"చివరి కంపార్ట్‌మెంట్ కింద పడిపోయారమ్మా..."

వళ్ళంతా చల్లబడి నా కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి. గొంతు తడారిపోతోంటే, "ఎలా జరిగింది?" అని అడిగాను.

"నా కళ్ళముందే జరిగిందమ్మా... ఆపుతున్నా ఆగకుండా... నన్ను తోసేస్తూ పరుగున వెళ్ళి రైలుకింద పడిపోయారమ్మా..."

చిట్టిబాబు ఇంకా ఏదో చెబుతున్నాడు.

నా కళ్ళు తిరుగుతున్నాయి. ఏమీ వినిపించడం లేదు.

***సాక్షి 'ఫన్ డే', 15 జనవరి, 2012***